వేడుకగా ఘటం ఊరేగింపు


ఫలహారం బండి ఊరేగింపులో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, ఎన్.గౌతంరావు


ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు



కనకాల కట్టమైసమ్మ అమ్మవారి దర్శనం


బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎక్కాల కన్నా

అంబర్‌పేట్/ ముషీరాబాద్ జోన్ పరిధిలో ఘటం ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ ఊరేగింపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పోతరాజుల విన్యాసాలు, దప్పుళ్ల చప్పుళ్లతో యువకులు, సందడి చేశారు. లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్ట మైసమ్మ దేవాలయం వద్ద ఘటోత్సవం ఘనంగా నిర్వహించారు. హుస్సేన్ సాగర్‌లో గంగ తెప్పోత్సవంలో భాగంగా గంగాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కాచిగూడ, కవాడిగూడ, చిక్కడపల్లి, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ముషీరాబాద్, అంబర్‌పేట్, నల్లకుంట, గోల్నాక, బర్కత్‌పుర తదితర ప్రాంతాల్లో ఘటాల ఊరేగింపులో ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

– అంబర్‌పేట్/ ముషీరాబాద్ బృందం


అంబర్‌పేట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డి


సికింద్రాబాద్ మహంకాళి ఆలయం నుంచి తీసుకొచ్చిన అమ్మవారి విగ్రహం


బతుకమ్మకుంట మైసమ్మ అమ్మవారు


గోల్నాక జైస్వాల్‌గార్డెన్‌లో మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి


గోల్నాక తొట్టెల ఊరేగింపులో దూసరి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు


మహంకాళి అమ్మవారికి తొట్టెల ఊరేగింపులో పోతరాజుల నృత్యం


ఆలయ కమిటీ చైర్మన్ గౌతమ్‌కుమార్, ఈఓ సాంబశివరావు

క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. ఆర్టీఎం ఫీడర్ పరిధిలో ఎమ్మార్వో ఆఫీస్, ఆర్టీసీ కల్యాణ మండపం, సోప్ ఫ్యాక్టరీ, అచ్చయ్యనగర్, రాజేంద్ర ఆయిల్‌మిల్ తదితర ప్రాంతాల్లో 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు చిక్కడపల్లి ఫీడర్ పరిధిలో వేంకటేశ్వర స్వామి దేవాలయం, ఉమా గార్డెన్, బాగ్ లింగంపల్లి తదితర ప్రాంతాల్లో 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, గోల్కొండ ఎక్స్‌రోడ్స్ ఫీడర్ పరిధిలో ఏక్‌మినార్ మసీద్, కృష్ణాకాలనీ, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్, స్పెన్సర్ ఫీడర్ పరిధిలో శివాలయం దేవాలయం, రాజా డీలక్స్, రేస్ కోర్స్, ఎన్‌బీకే ఎస్టేట్ చర్చి తదితర ప్రాంతాల్లో 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ప్రకటించారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న దామోదర్ గుప్తా, సింగారపు రమేష్

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి చేపూరి లక్ష్మణ్, అదనపు కార్యదర్శి అమర బాలకుమార్, కోశాధికారి చిట్టిమిళ్ల శ్రీనివాస్, ప్రాజెక్టు చైర్మన్ తోడుపునూరి రవి, ప్రసాద్, సింగారపు శంకర్, వెంకట సుబ్బయ్య, సురేందర్ గుప్తా, మామిండ్ల శ్రీనివాస్, పల్లెర్ల రమేష్, నర్సింహ, లక్ష్మి, వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత వీహెచ్‌తో పొంగులేటి భేటీ


పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

అంబర్‌పేట: తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో– చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ వీ.హన్మంత్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం డీడీకాలనీలోని వీహెచ్ నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పూల బొకేను వీహెచ్‌కు అందజేశారు.

అన్నదానం.. పుణ్యకార్యం


కాచిగూడలో అన్నదానం చేస్తున్న వినోద్ యాదవ్, లడ్డూ యాదవ్‌లు

కాచిగూడ: ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని బీజేపీ ఓబీసీ విభాగం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ అన్నారు. బోనాల వేడుకల సందర్భంగా లడ్డూయాదవ్ ఆధ్వర్యంలో సోమవారం చెప్పల్‌బజార్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని అలాంటిది పదిమందికి పంచి పెట్టడం మహాదానమన్నారు. కులమతాలకు అతీతంగా పండుగలను నిర్వహించుకుంటున్న కాచిగూడ ప్రజలకు బోనాల వేడుకల శుభాకాంక్షలు తెలిపారు.

'తరం' లఘు చిత్రం పోస్టర్ ఆవిష్కరణ

నల్లకుంట: బ్రాహ్మణతత్వాన్ని అత్యున్నత స్థాయిలో చూపిస్తూ.. వర్ధమాన నిర్మాత కొల్లూరు రవి కిరణ్‌శర్మ ఫిలిం బ్యానర్‌పై సీనియర్ దర్శకుడు డాక్టర్ పీసీ ఆదిత్య నిర్మించిన 'తరం' చిత్రం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సోమవారం కేంద్రమాజీ మంత్రి, తెలంగాణ నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి ఆవిష్కరించారు. తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, ఆంధ్రప్రదేశ్ అపర్ణ ప్రదీప్న, శ్రీనిధిరఘు, చిత్ర కథానాయకుడు శివసాయి పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రలకు కనీస వేతనం అమలు చేయాలి


మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరియాదయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు రూ.28 వేల కనీస వేతనం అమలు చేయాలని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గిరియాదయ్య డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. గత 16 ఏళ్లుగా ఆరోగ్యశ్రీ పథకంలో ఆరోగ్రమిత్రలుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీలు పూర్తి చేసి క్వాలీఫైడ్ వ్యక్తులుగా ఉన్న తమను నైపుణ్యంలోని ఉద్యోగులుగా గుర్తించడం అత్యంత బాధాకరమన్నారు. రూ.15,600 వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదురౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్రప్రభుత్వం కనీస వేతనంతో పాటు రూ.5 వేల టీఏ,డీఏ చెల్లించాలన్నారు. షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేసి చనిపోయిన మిత్రల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కుమార్, ఉపాధ్యక్షులు విష్ణు, నవీన్‌కుమార్, అనుజా, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన సోమవారం కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎ.సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం... ఉందానగర్ – తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని మహిళ (35) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగుజాతి ఔన్నత్యాన్ని ఆవిష్కరించిన 'తానా' మహాసభలు


సత్కరిస్తున్న ఇటక్లా సంస్థ అధ్యక్షుడు సంస్కృతిరత్న డాక్టర్ కె.ధర్మారావు

కాచిగూడ: తానా మహాసభలు తెలుగుజాతి ఔన్నత్యం, ఔచిత్యాన్ని సమున్నతంగా ఆవిష్కరించాయని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. తానా ఆధ్వర్యంలో అమెరికాలోని ఫిలడెల్ఫియా నగరం పెన్సిల్వేనియా కన్వెన్షన్ సెంటర్‌లో తానా 23వ ప్రపంచసదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తోటకూరను 'ఇటక్లా' (అంతర్జాతీయ తెలుగు సంఘం) అమెరికాలో ఘనంగా సత్కరించింది. ముఖ్య అతిథిగా కృష్ణమోహన్‌రావు, ప్రముఖ కవి జొన్నవిత్తుల, డాక్టర్ ధర్మారావులు ప్రసాద్ తోటకూరను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. తానా మహాసభలో ఈసారి సామాజిక న్యాయకోణంలో బహుజనవాదంపై సమాలోచన, సిరివెన్నెల సమగ్ర సినీ సాహిత్య సంపుటాలు నిర్వహించడం గొప్పగా ఉందన్నారు. ప్రపంచంలోని తెలుగు వారంతా ఒక్కటే అని చాటి చెప్పి, సమైక్య పూరితంగా నినదించడంలో తానా మహాసభలు నిదర్శనంగా నిలిచాయన్నారు. విశ్వవేదికపై తనకు మహాత్మాపూలే పురస్కారం అందజేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ.. తానా సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా 'సిరివెన్నెల సమగ్ర సినీ సాహిత్య సంపుటాలు', 'బహుజన శతకం' పుస్తకాలను ఆవిష్కరించినట్లు సంస్కృతిరత్న డాక్టర్ కె. ధర్మారావు వివరించారు.

ఆహ్వానం అందజేత



నల్లకుంట: ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఈ నెల 23న నిర్వహించే బ్రాహ్మణ సంఘాల ఆత్మీయ శంఖారావానికి హాజరు కావాలని సముద్రాల వేణుగోపాలచారికి టీబీఎస్ఎస్ ప్రతినిధులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల చారి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి తనని ఆహ్వానించడం ఆనందంగా ఉందని బ్రాహ్మణ సభస్సులు ఎక్కడ జరిగినా తాను హాజరవుతానని స్పష్టం చేశారు. పోచంపల్లి రమణారావు, సినీ దర్శకుడు పీసీ ఆదిత్య, శ్రీనిధి రఘు, కొల్లూరు రవికిరణ్ దుర్భాకుల, టీబీఎస్ఎస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు విష్ణుదాస్ గోపాల్‌రావు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పరామర్శ


పరామర్శిస్తున్న కేంద్రమంత్రి రామ్‌దాస్ అథావాలే

అంబర్‌పేట: అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్‌పీఐ దక్షిణ భారత ప్రధాన కార్యదర్శి సుబ్బారాయుడిని కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి రామ్‌దాస్ అథావాలే పరామర్శించారు. సోమవారం బాగ్‌అంబర్‌పేటలోని న్యూ వినాయక నగర్‌లో నివసిస్తున్న సుబ్బారాయుడు ఇంటికి వచ్చి ఆయన బాగోగులను తెలుసుకున్నారు. 'రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా' బలోపేతానికి సుబ్బారాయుడు అందించిన సేవలను అభినందించారు. ఆర్‌పీఐ నేతలు పేరం శివనాగేశ్వర్‌రావు, రవి, స్నేహలత, సచిన్, శ్రావణ్‌కుమార్, మాల ప్రజా సంఘాల జేఏసీ నాయకులు బూర్గుల వెంకటేశ్వర్లు, రమేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలి


మాట్లాడుతున్న వేముల రామకృష్ణ, గుజ్జ కృష్ణ

కాచిగూడ: రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల రామకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడలో గురుకుల పాఠశాలల్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను కలిసిన అనంతరం మాట్లాడుతూ.. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ఎన్నో పోరాటాలు చేయడంతోనే ప్రభుత్వం స్పందించి గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు.

- అధికారులు గురుకుల పాఠశాలల్లో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తుండటంతో పేద విద్యార్థులు సీట్లు సాధించలేకపోతున్నారన్నారు.
- కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులే మెరిట్‌తో గురుకుల పాఠశాలల్లో సీటు పొందుతుండటంతో పేదలు చదువుకు దూరమవుతున్నారన్నారు.
- ఓ వైపు పాఠశాలలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా గురుకుల పాఠశాల్లో అడ్మిషన్లు పూర్తి చేయక పోవడంతో విద్యార్థులు చదువులో వెనుకబడిపోయే అవకాశాలు ఉన్నాయన్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి ఒక బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసి దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ గురుకులాల సాధనకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.
- గురుకుల పాఠశాలల ఏర్పాటు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

బందోబస్తులో సెంట్రల్ పీస్ కమిటీ


కమిటీ ప్రతినిధులు శ్రీకిషన్ శర్మ, శరత్‌శ్యామ్ తదితరులు

కాచిగూడ: శాంతి భద్రతల పరిరక్షణలో సెంట్రల్ పీస్ కమిటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అడిషనల్ పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) విక్రమ్‌సింగ్ అన్నారు. బోనాల వేడుకల సందర్భంగా పాతబస్తీలోని అక్కన్న, మాదన్న మహంకాళి దేవాలయం వద్ద సెంట్రల్ పీస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతినిధులు పోలీసులతో కలిసి బందోబస్తులో పాల్గొని స్వచ్ఛంద సేవలు అందించారు. కాచిగూడ డివిజన్ బర్కత్‌పుర నుంచి సెంట్రల్ పీస్ కమిటీ ఈస్ట్‌జోన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.శరత్‌శ్యామ్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ ప్రతినిధులు పోలీసులకు సహకరించారు. ఈ సందర్భంగా వారిని అడిషనల్ కమిషనర్ అభినందించారు. సెంట్రల్ పీస్ కమిటీ ఆల్ జోన్స్ కిషన్‌శర్మ, సెంట్రల్ జోన్ ప్రెసిడెంట్ శశికాంత్ అగర్వాల్, సౌత్ జోన్ ప్రెసిడెంట్ ఖాజా అబ్దుల్ మోయిజ్, ఈస్ట్‌జోన్ ప్రెసిడెంట్ ఎస్.నారాయణ రెడ్డి, జనరల్ సెక్రటరీ డాక్టర్ మజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోరికలు నెరవేరుస్తా


ముషీరాబాద్ మహంకాళి దేవాలయంలో భవిష్యవాణి చెబుతున్న స్వర్ణలత

ముషీరాబాద్: భక్తులు కోరిన కోరికలు నెరవేరుస్తానని భవిష్యవాణి చెప్పే రంగం కార్యక్రమంలో స్వర్ణలత తెలిపారు. బోనాల ఉత్సవాలలో భాగంగా సోమవారం ముషీరాబాద్ మహంకాళి దేవాలయంలో రంగం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పచ్చికుండపై ఆమె నిలబడి భవిష్యవాణిని వివరించారు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా పడతాయని ప్రజలందరినీ చల్లగా చూస్తానన్నారు. ప్రజలకు రోగాలు దరిచేరనియ్యకుండా కాపాడతానన్నారు. భక్తులు అడిగిన ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు. బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు, దేవాదాయశాఖ ఈఓ జ్యోతి, ధర్మకర్తలు బల్లా రూపాశ్రీ, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ సంగిశెట్టి రాజ్‌కుమార్, నాయకులు ప్రశాంత్, వంగాల నర్సింగ్ రావు, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి.. ఆపై కోచింగ్ సెంటర్

చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ డిమాండ్

ముషీరాబాద్: ప్రభుత్వ ఉద్యోగై ఉండి కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.వీ.శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా హైదరాబాద్‌లో కోచింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారన్నారు. తాను సంగారెడ్డి ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా విధుల్లో ఉన్నారన్నారు. ప్రభుత్వ లెక్చరర్‌గా విధులు నిర్వహించకుండా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఆయన నిర్వహించే ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌కు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి సదరు ప్రభుత్వ ఉద్యోగైన వెంకన్నను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున దశలవారీగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అలరించిన శృతిలయ సినీగీత విభావరి

చిక్కడపల్లి: సినీసంగీత సంస్థ శృతిలయలు నిర్వహణలో 'సదా ఇన్‌ఫ్రా డెవలపర్స్' సౌజన్యంతో త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై రాగాల పల్లకిలో శృతిలయలు శీర్షకన సినీసంగీత విభావరి సభికులను అలరించింది. సోమవారం ఫణి ఓరుగంటి తన తండ్రి టీకే.శ్రీనివాస్‌తో కలిసి 'భలే మంచిరోజు' పాటను పోటాపోటీగా పాడి ప్రశంసలు అందుకున్నారు. ఉమామాధవి సహగాయకులు ఆదిత్య రాజన్, పాల్గుణ, మాధవి, రఘుపతి, రవి ఆచార్యలతో కలిసి నాటి పాటలను మధురంగా ఆలపించారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన 12 గంటల గాన విభావరిలో శ్రీవేణి, అపర్ణ, శ్వేత, భూషణ్ తదితర గాయనీగాయకులు 40 మంది పాల్గొన్నారు. సదా ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఎండీ ఫణి ఓరుగంటి అనాథాశ్రమం ప్రతినిధులకు ఆర్థికసాయం అందజేశారు.


గాయకులతో ఫణి ఓరుగంటి